ప్రజాశక్తి

శుక్రవారం 20 అక్టోబర్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



రైతు కంట తడి

- పొట్ట దశలో ఎండుతున్న వరి
- తీవ్ర వర్షాభావం
- 16 మండలాల్లో లోటు
- కరువు తీవ్రతను తక్కువ చేసి చూపే యత్నంలో ప్రభుత్వం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లాలో ఎండిపోతున్న పంటను చూసి రైతు కంటతడి పెడుతున్నాడు. పెట్టిన పెట్టుబడికి పంట చేతికి రాదని కుంగిపోతున్నాడు. వానల్లేక వరి పంట ఎండకు మలమల మాడిపోతోంది. పెద్దేరు, తాండవ, రైవాడ, కోనాం జలాశయాల ప్రధాన కాలువ ఆయకట్టు, బోర్లు కింద పంటలు మినహా మిగిలిన భాగం ఎండకు దెబ్బతింటోంది. ప్రసవ సమయంలో గర్భ విచ్ఛిత్తి జరిగినట్లు, పొట్ట దశలో వర్షాల్లేక వరి పంట పూర్తిగా నష్టపోతుందని రైతులు వాపోతున్నారు. ఖరీఫ్‌లో వివిధ పంటల సాధారణ సాగు విస్తీర్ణం 2,04,985 ఎకరాలకు 1,35,095 ఎకరాల్లో (66 శాతం) సాగైంది. ఇందులో వరి 1,36,460 ఎకరాల్లో సాగు కావాల్సివుండగా, 1,10,765 ఎకరాల్లో (81 శాతం) నమోదైంది. వరి సాగులో సగానికి పైగా పంట నష్టం జరగనుంది. చాలీచాలని తడులతో మదుపులు పెట్టి ఉడుపులు చేసినా, తరువాత వర్షాలు ఎడపెట్టడంతో చేతికి పంటరాని పరిస్థితి నెలకొంది. పొట్ట దశలో నీటి తడి ఉండాల్సిన అక్టోబర్‌లో వర్షాల్లేక వరి చేను ఎండు గడ్డిలా తయారవుతోంది. చెరకు దిగుబడి తగ్గనుంది. వేరుశనగ, ఇతర పంటల దిగుబడులు భారీగా తగ్గనున్నాయి.

ఈ నెల ఒకటి నుంచి 18వ తేదీ వరకు 178.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సివుండగా కేవలం 25.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఖరీఫ్ ఆరంభం జూన్ నుంచి అక్టోబర్ 18 వరకు 860.8 మిల్లీ మీటర్లకు 629 మిల్లీ మీటర్ల వర్షపాతం (-26 శాతం లోటు) నమోదైంది. జిల్లాలోని 24 మండలాల్లో 16 మండలాల్లో వర్షపాతం లోటు ఉండగా, ఏడు మండలాల్లో సాధారణ వర్షపాతం, చీడికాడ మండలంలో అధిక వర్షపాతం నమోదైంది. సగానికి పైగా మండలాల్లో వర్షపాతం లోటు ఉండడంతో ఆ ప్రభావం పంటలపై పడింది.



పెద్దేరు జలాశయం నీరు రాక బీటలు దేరిన వరి పొలం

వర్షపాతం లోటు మండలాలు

రోలుగుంట మండలంలో -24.2, రావికమతంలో -27.4, వి.మాడుగులలో -29.6, కోటపాడులో -29.1, సబ్బవరంలో -29.2, పరవాడలో -37.9, అనకాపల్లిలో -34.1, కోటవురట్లలో -20.7, మాకవరపాలెంలో -40.4, మునగపాకలో -42.7, అచ్యుతాపురంలో -44.7, యలమంచిలిలో -47.6, నక్కపల్లిలో -51.9, పాయకరావుపేటలో -51, ఎస్.రాయవరంలో -33.9, రాంబిల్లిలో -50.6 మిల్లీ మీటర్ల వర్షపాతం లోటు ఉంది. వర్షాల్లేక దెబ్బతింటున్న పంటల సమాచారం అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. వర్షపాతం వివరాలు ఇవ్వడానికి కూడా ఇష్టపడ్డంలేదు. కరువు తీవ్రతను అధికారికంగా ధ్రువీకరించకుండా తక్కువ చేసి చూపే ప్రయత్నం జరుగుతోంది. రైతుకు పంట నష్ట పరిహారం చెల్లించకుండా ఉండేలా కరువు లేదని చెప్పే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోంది.



నిరవధిక దీక్షలో కూర్చున్న యుటిఎఫ్ నాయకులు

పాత పెన్షన్ అమలుకు యుటిఎఫ్ దీక్ష

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సిపిఎస్, జిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద యుటిఎఫ్ విశాఖ జిల్లా సహాధ్యక్షులు రొంగలి ఉమాదేవి అధ్యక్షతన గురువారం నిరాహార దీక్షలు చేపట్టారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర నాయకత్వం చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలకు కొనసాగింపుగా ఉమ్మడి విశాఖపట్నం జిల్లా యుటిఎఫ్ నాయకులు గొంది చిన్నబ్బాయి, టిఆర్.అంబేద్కర్, తాడాన అప్పారావు, చుక్క సత్యం, ఉప్పాడ రాము, ఎస్.నూకరాజు, రిజ్వాన్, గేదెల శాంతిదేవి దీక్షల్లో కూర్చున్నారు. సీనియర్ నాయకులు సామారాజులు, ఎస్ఎస్.నాగమణి, ఎన్.ప్రభాకర్, ఉషారాణి పూల మాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన వెంటనే సిపిఎస్‌ను రద్దు చేసి, ఓపిఎస్ అమలు చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఉద్యోగులు ఉపాధ్యాయులకు మరణ శాసనమైన జిపిఎస్‌ను అమలులోకి తీసుకురావడం మోస పూరిత చర్య అని పేర్కొన్నారు. తక్షణమే జిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ, సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను మాత్రమే అమలు చేస్తామని రాజకీయ మేనిఫెస్టోలో పెట్టే పార్టీలకు మాత్రమే రానున్న ఎన్నికల్లో ఉద్యోగుల, ఉపాధ్యాయుల ఓట్లు వేయనున్నట్లు స్పష్టంచేశారు. ఒపిఎస్ సాధనకు రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి వైఆర్‌కె.ప్రసాద్, ఉమ్మడి జిల్లా నాయకులు జిఎస్.ప్రకాష్, ఎస్.నూకరాజు, యల్లయ్య బాబు, రియాజ్ అహ్మద్, టి.జగన్, చంద్రరావు, ఎం.రామకృష్ణ, సంతోష్, ఉమాబాల, ప్రేమకుమారి, వివిధ మండలాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగన్, సుబ్బారెడ్డి కబంద హస్తాల్లో జివిఎంసి : గంగారావు

▶ వార్త 8లో..

పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

▶ వార్త 2లో..

కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ధర్నా

▶ వార్త 5లో..

లా వర్సిటీ వీసీగా సూర్యప్రకాశరావు బాధ్యతలు

▶ వార్త 5లో..

రూ.13.33 కోట్లు జగనన్న చేదోడు జమ

జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి- విశాఖపట్నం : విశాఖ జిల్లా కలెక్టరేట్‌లో జగనన్న చేదోడు కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులతో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకం క్రింద జిల్లాలో 5,942 మంది రజక, 1,521 మంది నాయిబ్రాహ్మణులు, 5,862 మంది దర్జీ లబ్ధిదారులకు మొత్తం రూ. 13.33 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. ఇంకా ఎవరైనా అర్హులై మిగిలిపోయి ఉంటే సంబంధిత సచివాలయంలో నమోదు చేసుకోవాలని, వారికి వచ్చే ద్వైవార్షిక కార్యక్రమంలో మంజూరు చేస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రజాప్రతినిధులతో కలిసి నమూనా చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ యువశ్రీ, నాయి బ్రాహ్మణుల కార్పొరేషన్ డైరెక్టర్ వి.నూకరాజు, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.ప్రసాద్, రజక, నాయి బ్రాహ్మణ, దర్జీ లబ్ధిదారులు పాల్గొన్నారు.



నమూనా చెక్కును అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున తదితరులు

శ్మశానాలు, వీధిలైట్లు, కార్మికుల జీతాలు, అభివృద్ధి పనుల్లో తేడాలపై

కౌన్సిల్ గరం.. గరం...



కౌన్సిల్‌లో నిలదీస్తున్న గంగారావు తదితరులు

- అర్హతల పేరుతో కార్మికుల వేతనాలను తగ్గించొద్దు : బి.గంగారావు
- వీధిలైట్లను వెలిగించడంలో విఫలమయ్యాం : మేయర్, కమిషనర్
- భీమిలివైపే రూ.కోట్లు నిధులా : టిడిపి కార్పొరేటర్లు
- విశాఖ పరిపాలనా రాజధాని కాబట్టే పనులు : ముత్తంశెట్టి
- ఇంకెక్కడ రాజధాని : "చెవిలో పువ్వులు" పెట్టుకున్న టిడిపి కార్పొరేటర్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నగరంలోని పలు వార్డుల్లోని శ్మశానాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిధులివ్వడం లేదని, వార్డుల్లో వీధిలైట్లు వెలగడం లేదని, జివిఎంసి కార్మికులకిచ్చే జీతాల విషయంలో అన్యాయాన్ని సరిచేయాలని, అభివృద్ధి పనులు ఒకవైపే కాకుండా అన్నిచోట్లా చేపట్టాలని కోరుతూ గురువారం జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన, సిపిఎం, సిపిఐకి చెందిన కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. కొన్ని సమస్యలపై అధికార వైసిపి సభ్యులు సైతం గొంతుకలిపారు. భీమిలి నియోజకవర్గం 4వ వార్డు పరిధిలో రూ.10కోట్ల మేర ఖర్చుచేసి రోడ్ల విస్తరణ చేపట్టడంపై 22వ వార్డు జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ అభ్యంతరం తెలపగా భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వివరణ ఇస్తూ.. 'ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విశాఖను పరిపాలనా రాజధాని చేయాలని చేపలుప్పాడ, టి నగరపాలెం పరిధిలో

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కౌన్సిల్ గరం.. గరం...

రోడ్ల పనులకు జివిఎంసి నిధులు వెచ్చించిందని, విశాఖ నగరం అంతటా ఈ పనులు జరుగుతున్నాయని మీకు నగరాభివృద్ధి అక్కర్లేదా? అంటూ ప్రశ్నించారు. దీంతో టిడిపికి చెందిన పలువురు కార్పొరేటర్లు 'ఇంకెక్కడ రాజధాని' అని వారు అప్పటికే తెచ్చుకున్న పువ్వులను బయటకు తీసి చెవుల్లో పెట్టుకుని వ్యంగ్యంగా రాజధాని విశాఖకు ఇంకా రాదని, నమ్మించవద్దంటూ నినాదాలు చేశారు. కౌన్సిల్‌లో చర్చించకుండా చాలాచోట్ల రూ.కోట్లతో వైసిపి వార్డులను మాత్రమే అభివృద్ధి చేస్తున్నారంటూ టిడిపి కార్పొరేటర్లు ప్లకార్డులతో నిరసన తెలిపారు.

అర్హతల పేర జీతాల్లో కోతపెట్టొద్దు : సిపిఎం కార్పొరేటర్ గంగారావు

నీటిసరఫరా, యుజిడి, ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 400 మంది కార్మికుల విషయంలో అర్హతలను పెట్టి రూ.18,500లు అందకుండా చేసే చర్యలు మానుకోవాలని మేయర్ పోడియం వద్దకు వెళ్లి సిపిఎం కార్పొరేటర్ గంగారావు డిమాండ్ చేశారు. గతంలో జిఒ 5, 7 కింద జీతాలిచ్చారని, మధ్యలో పొరపాటేదో జరిగిందని కలెక్టర్ వద్దకు ఈ వ్యవహారం వెళ్లిందని తెలిపారు. జిఒ పేరుతో ఫిట్టర్, ఎలక్ట్రికల్ అసిస్టెంట్స్ అనేవి అర్హతలుగా చూపించి 600 మందిలో కేవలం 150 మందికే రూ.18,500 జీతం ఇచ్చేలాగ కాకుండా అందరికీ వర్తించేలా విధానాన్ని సవరించి మిగతా 400 పైచిలుకు కార్మికులకు అన్యాయం జరగకుండా అజెండాను ఆమోదించాలని, మిగతా రాజకీయ పార్టీల కార్పొరేటర్లు మద్దతుగా నిలవాలని కోరారు. జివిఎంసి వాటర్ సప్లయ్ ఇంజినీర్ రవి మాట్లాడుతూ, కొంతమందికే ఆప్కోస్ నుంచి జీతాలు రావడం లేదని 10ఏళ్ల అనుభవం దాటిన 119 మందినే ఎంపిక చేశామని చెప్పడంపై గంగారావు, మరికొందరు సభ్యులు అభ్యంతరం తెలిపారు. శ్మశాన వాటికలయందు మౌలిక వసతులకు నిధుల కేటాయింపు రెండేళ్లుగా టెండర్లు పిలిచినా పనులు జరగడం లేదని అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ పి.వి.సురేష్, ప్రతిపక్ష టిడిపికి చెందిన పలువురు కార్పొరేటర్లు గగ్గోలు పెట్టారు. 3 నెలల్లో ఈ సమస్యకు పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటామని మేయర్ గొలగాని హరివెంకటకుమారి హామీ ఇచ్చారు.

వీధిలైట్లు వెలగడం లేదు : గగ్గోలు పెట్టిన కార్పొరేటర్లు

నగరంలో సగానికిపైగా వార్డుల్లో రాత్రిపూట వీధిలైట్లు వెలగడం లేదంటూ 86వ వార్డు టిడిపి కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు కౌన్సిల్‌లో లేవనెత్తారు. ఇంకా పలువురు సభ్యులు ఇదే అంశంపై ఏకరువు పెట్టగా మేయర్ హరివెంకటకుమారి జోక్యం చేసుకుని 'వీధిలైట్ల విషయంలో జివిఎంసి ఫెయిల్ అయ్యిందని ఆవేదన చెందారు. కమిషనర్ సాయికాంత్ వర్మ వివరణ ఇస్తూ నగరంలో 1.18 లక్షల లైట్లున్నాయని, వీటిని కంట్రోల్ చేసే సిసిఎంఎల్ బాక్సులు 5517 ఉన్నాయని కాంట్రాక్టు పొందిన బ్రిడ్జ్ అండ్ రూఫ్ సంస్థ సక్రమంగా నిర్వహణ చేయలేకపోతుందని, మొదటి షో కాజ్ నోటీసు కూడా ఇటీవలే ఇచ్చామని తెలిపారు. రోజూ సాయంత్రం 6గంటలకు ఆటోమేటిక్‌గా వీధి లైట్లు ఆన్ అవ్వాల్సి ఉందన్నారు. సదరు సంస్థ నియంత్రణ చేయలేకపోవడం గుర్తించామని ప్రొసీజర్ ప్రకారం మరో రెండు నోటీసులిచ్చి ఆ కంపెనీని వదిలించుకోవాల్సి ఉందన్నారు. 98 వార్డుల్లో సుమారు 40వేల లైట్ల వరకూ రిపేరు చేశామని, భవిష్యత్తులో ఈ సమస్య రాకుండా చూస్తామన్నారు.



నిరసన తెలుపుతున్న టిడిపి కార్పొరేటర్లు

జిల్లాలో దేవులపల్లి అమర్ పర్యటన

ప్రజాశక్తి-విశాఖపట్టణం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ ఉమ్మడి జిల్లాలో నాలుగు రోజులు పర్యటించేందుకు గురువారం మధ్యాహ్నం విశాఖ చేరుకున్నారు. ఆయనకు సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు వి.మణిరామ్, ఇతర అధికారులు విశాఖ ఎయిర్ పోర్టులో పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. గురువారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు.

తొలి రోజు పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం సంబంధిత శాఖల అధికారులతో సమావేశమయ్యారు. స్థానిక సర్క్యూట్ హౌసులో రాత్రికి బస చేశారు. రెండో రోజు శుక్రవారం అరకులో పర్యటించనున్నారు. 21, 22 తేదీల్లో విశాఖలోనే కార్యక్రమాల్లో పాల్గొంటారు.

పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి దసరా పండుగ సందర్భంగా విశాఖపట్నం-కర్నూలు-విశాఖపట్నం, హైదరాబాద్-కటక్-హైదరాబాద్, సికింద్రాబాద్-సంత్రాగచ్చి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడపాలని రైల్వే నిర్ణయించింది.

08585 విశాఖపట్నం-కర్నూలు సిటీ ప్రత్యేక రైలు ఈ నెల 24 నుంచి నవంబర్ 14వ తేదీ వరకు ప్రతి మంగళవారం సాయంత్రం 17.35 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 13.25 గంటలకు కర్నూలు సిటీకి చేరుకుంటుంది. 08586 కర్నూలు సిటీ-విశాఖపట్నం ప్రత్యేక రైలు ఈ నెల 25 నుంచి నవంబర్ 15వ తేదీ వరకు ప్రతి బుధవారము మధ్యాహ్నం 15.30 గంటలకు కర్నూలు సిటీలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైళ్లు దువ్వాడ, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లె, మిర్యాలగూడ, నల్గొండ, మల్కాజిగిరి, కాచిగూడ, ఉమ్దానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల్ మీదుగా ప్రయాణిస్తాయి.

07165 హైదరాబాద్-కటక్ ప్రత్యేక రైలు ఈ నెల 24 రాత్రి 20.10 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు 9.05 గంటలకు దువ్వాడ, అదేరోజు సాయంత్రం 17.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. 07166 కటక్-హైదరాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 25వ తేదీ రాత్రి 23:30 గంటలకు కటక్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ, రాత్రి 21.00 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దారోడ్డు, భువనేశ్వర్ మధ్య నడుస్తాయి.

07645 సికింద్రాబాద్ - సంత్రాగచ్చి ప్రత్యేక రైలు ఈ నెల 20వ తేదీ ఉదయం 8.40 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి రాత్రి 19.40 గంటలకు దువ్వాడ, మరుసటి రోజు ఉదయం 10.40 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. 07646 సంత్రాగచ్చి - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 21న మధ్యాహ్నం12:20 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుఝామున 2.03 గంటలకు దువ్వాడ, అదేరోజు మధ్యాహ్నం 15.00 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, గుంటూరు, విజయవాడ, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రాక్‌రాగ్‌డ్రాగ్, భువనేశ్వర్, భద్రాగ్ మధ్య నడుస్తాయి. ఈ ప్రత్యేక రైళ్ల సేవలను ప్రజలు వినియోగించుకోవాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి కోరారు.

ఫలించిన కార్మికుల పోరాటం : వెంకటరెడ్డి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మినిట్స్ అమలుకు నిరీక్షణ, కొన్ని శక్తుల అడ్డంకులను దాటుతూ, ఓర్పు, సహనంతో సాధించుకున్న వాల్వు ఆపరేటర్స్, ఫిట్టర్ హెల్పర్, ఎలక్ట్రికల్ హెల్పర్లకు జివిఎంసి వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు పి.వెంకటరెడ్డి అభినందనలు తెలిపారు. గురువారం జరిగిన జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో నీటి సరఫరా అజెండా సందర్భంగా మేయర్ హరి వెంకట కుమారి రూలింగ్ ఇస్తూ మిగిలిన వారికీ జీతాలు పెంచుతూ మేలు చేయుటకు తీర్మానం చేస్తూ కమిషనర్‌ను ఆదేశించారని తెలిపారు. సమ్మె చేసి మినిట్స్ సాధించుకున్న కార్మికులకు అభినందనలు తెలిపారు. ఎజెండాపై చర్చ సందర్భంగా సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడారన్నారు. అమలుకు సహకరించిన వైఎస్ఆర్‌సిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావుకు, టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావుకు, జనసేన ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంత లక్ష్మికి, కమిషనర్ అనురాగ్‌శర్మకు, సిఇ రవి కృష్ణరాజుకు తమ యూనియన్ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.

18న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు నవంబర్ 18న జరుగుతాయని జెడ్‌పి సిఇఒ పి.శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అన్ని శాఖల నుంచి ప్రగతి నివేదికలు కోరుతూ లేఖలు పంపించామని పేర్కొన్నారు. స్థాయీ సంఘ సమావేశాల నిర్వహణకు అన్ని శాఖలు సంసిద్ధంగా ఉండాలని, సకాలంలో ప్రగతి నివేదికలు అందించాలని ఆయన కోరారు.

అసువులు బాసిన పాలస్తీనియన్లకు నివాళి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : యుద్ధ నియమాలు ఉల్లంఘించి అమెరికా దన్నుతో ఇజ్రాయిల్ సాగిస్తున్న మరణకాండలో అసువులు బాసిన పాలస్తీనియన్లకు పౌర, ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యాన గురువారం ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని గురజాడ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. సామ్రాజ్యవాద ప్రేరేపిత యుద్ధాలు వద్దు, ప్రపంచ శాంతి కావాలని, పాలస్తీనా జాతి వియోచన పోరాటాలు వర్ధిల్లాలని నినాదాలు చేశారు. యుఎన్ఒ తీర్మానాన్ని కాదని పాలస్తీనాపై దాడులు జరుగుతున్నాయని తెలిపారు. అమెరికా దన్నుతో పాలస్తీనాపై అనాదిగా ఇజ్రాయిల్ దమనకాండను కొనసాగిస్తోందని పేర్కొన్నారు. తాగునీరు, మందులు, నిత్యావసర వస్తువులు పాలస్తీనాకు సరఫరా కానీయకుండా అడ్డుకోవడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో పౌర ప్రజా సంఘాల నేతలు జెవి.సత్యనారాయణమూర్తి, ఎం.పైడిరాజు, ఎ.విమల, టి.శ్రీరామమూర్తి, వివిఎస్.కృష్ణ, ఎం.లక్ష్మి, వేమన, శ్రీనివాస్, పి.చంద్రశేఖర్, బేగం, దేవుడమ్మ, రాధ పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న పౌర, ప్రజాసంఘాల నాయకులు

మాక్ యాంటీ-హైజాక్ ఎక్సర్‌సైజ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం విమానాశ్రయంలో ఐఎన్ఎస్ డేగా ఆధ్వర్యాన హైజాక్ వ్యతిరేక ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్), మెరైన్ కమాండోస్‌తో సహా వివిధ ఏజెన్సీలు సంయుక్తంగా ఈ ఎక్సర్‌సైజ్‌ను నిర్వహించాయి. హైజాక్ బెదిరింపులను సమర్థవంతంగా ఎదుర్కోవడం లక్ష్యంగా దీన్ని చేపట్టాయి. నావికాదళ విమానాన్ని ఉపయోగించి సృష్టించిన మాక్ సిట్యువేషన్‌తో యాంటీ-హైజాక్ వ్యాయామం విజయవంతమైంది. అనంతరం భవిష్యత్తులో ఆకస్మిక పరిస్థితులను ఎదుర్కోవడంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు.

మణిపాల్ చేతికి మెడిసిన్ పాత ల్యాబ్స్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : హైదరాబాదులోని మెడిసిస్ పాత ల్యాబ్స్‌లో నూరు శాతం వాటాను మణిపాల్ హెల్త్ మ్యాప్ కొనుగోలు చేసిందని సంస్థ సిఇఒ డాక్టర్ సందీప్ శర్మ తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తన పేరెంట్ బ్రాండ్ మణిపాల్ ట్రూటెస్ట్ కింద మణిపాల్ హెల్త్ మ్యాప్ మరో 23 అదనపు కేంద్రాలకు విస్తరించి 16 రాష్ట్రాలలో 100కు పైగా కేంద్రాలకు చేరిందన్నారు. మణిపాల్ హెల్త్ మ్యాప్ ఇంటిగ్రేటెడ్ డయాగ్నోస్టిక్ కేంద్రాలు సమగ్రమైన రోగ నిర్ధారణ సేవలు అందిస్తున్నాయని తెలిపారు. రక్త పరీక్షలు, ఎక్స్ -రేలు, ఎంఆర్ఐ స్కాన్ వంటి వివిధ రకాల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెడిసిస్ పాత ల్యాబ్‌ను కొనుగోలు చేయడంతో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ డయాగ్నోస్టిక్స్ సర్వీస్ బ్రాండ్‌గా తమ మణిపాల్ అవతరించిందని పేర్కొన్నారు.

శాంతి, మత సమైక్యతకు యుఎన్ఒ పాత్రపై 22న సదస్సు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బి.వి.ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మొనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థల ఆధ్వర్యాన ఈ నెల 22న ద్వారకానగర్‌లోని బాపు భవనంలో 'శాంతి, మత సమైక్యత నెలకొల్పడంలో ఐక్యరాజ్య సమితి పాత్ర' అంశం పై సదస్సు నిర్వహిస్తున్నామని సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ సదస్సులో నాగార్జున యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఈ అంశంపై అభిరుచి కలిగిన వారు సదస్సులో పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9032477463 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేవల్ ఎయిర్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ సిస్టమ్ ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : దేశీయంగా రూపొందించి, అభివృద్ధి చేసిన అత్యాధునిక నేవల్ ఎయిర్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ సిస్టమ్ ప్రాజెక్టును అరక్కోణంలోని ఐఎన్ఎస్ రాజాలిలో ఈస్టర్న్ నేవల్ కమాండ్, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ వైస్ అడ్మ్ రాజేష్ పెంధార్కర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సెక్యూరిటీ సిస్టమ్ ద్వారా ఈ నెల 23వ తేదీన క్విక్ రియాక్షన్ టీమ్ చొరబాటు గుర్తింపు చర్యల ప్రదర్శన నిర్వహించనున్నారు.



నిబంధనలన్నీ... 'నీటి' పాలేనా..?

- విచ్చలవిడిగా వాటర్ ప్లాంట్ల నిర్వహణ
- నిబంధనలు పాటించనివి, అనుమతుల్లేనివే ఎక్కువ!
- సాధారణ నీటినే.. మినరల్ వాటర్‌గా అమ్మకాలు?
- నిమ్మకు నీరెత్తినట్లున్న నియంత్రణ అధికారులు

ప్రజాశక్తి - ఆనందపురం: పెరుగుతున్న ప్రజల తాగునీటి అవసరాలను ఆసరాగా చేసుకుని పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అడుగడుగునా మినరల్ వాటర్‌ప్లాంట్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. ట్రస్టులు, ఫౌండేషన్ల ద్వారా స్వచ్ఛమైన నీటి సరఫరా పేరుతో నిబంధనలు పాటించకుండా, వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులు యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారనే విమర్శలున్నాయి. అనేక చోట్ల అనుమతులు లేకుండా వాటర్‌ప్లాంట్‌ను నిర్వహించడమే కాకుండా, సాధారణ నీటినే మినరల్ వాటర్‌గా పేర్కొంటూ అడ్డగోలుగా దండుకుంటున్నారనే విమర్శలూ ఉన్నాయి. లక్షల్లో బాహాటంగానే నీటి వ్యాపారం జరుగుతున్నా అక్కడ నిబంధనల అమలు, నాణ్యతా ప్రమాణాలపై అధికారులెవరూ కనీసస్థాయిలో కన్నెత్తి చూడకపోవడం విశేషం.

ఆనందపురం మండలంలో అనేకచోట్ల కనీసం బోర్డులు లేకుండా మినరల్ వాటర్ ప్లాంట్ల వ్యాపారం గుట్టు చప్పుడుగా సాగిస్తున్నారు. మండలంలోని గంభీరం ఐటీ సెజ్‌లోనూ, గుడిలోవ, బివిఅర్, ఆనందపురం కూడలిలో బోర్డు లేకుండా పలు వాటర్ ప్లాంట్లు దర్శనమిస్తున్నాయి. మినరల్ వాటర్ అనగానే మారుచూడకుండా ప్రజలు సైతం ఎగబడి అక్కడి నుంచి బాటిళ్లలో నీటిని తెచ్చుకుని. లేని రోగాలను 'కొని' తెచ్చుకుంటున్నారనే పలువురు అంటున్నారు. ఇంత బాహాటంగా నీటి వ్యాపారం సాగుతున్నా, సంబంధిత శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు, ఆందోళనకు గురిచేస్తోంది. నీటిని శుద్ధి చేసే వాటర్‌ప్లాంట్ స్థాయి, అక్కడ నాణ్యతా ప్రమాణాల పరిస్థితులను పట్టించుకోవడం, పర్యవేక్షించే నాథులే లేకపోవడంతో, నీటి వ్యాపారం కాస్తా మూడు బాటిళ్లు, అడ్డగోలు కలెక్షన్లు అన్నట్టుగా సాగుతోందని ఆరోపణలున్నాయి.

ఇక పెళ్లిళ్లు, పేరంటాళ్లు, పండుగలు, పబ్బాలొస్తే నీటి వ్యాపారానికి అడ్డే లేకుండా పోతోంది. ఏదేదో ప్రింట్ చేసిన వాటర్ ప్యాకెట్లు, స్టిక్కర్లు అతికించిన బాటిళ్లలో నీటిని నింపేసి అమ్మకాలు చేసేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే శుభకార్యాలయాల్లో 20లీటర్ల కూలింగ్ వాటర్ క్యాన్‌ను ఒక్కొక్కటీ రూ.30 నుంచి, రూ.50 వరకు వసూలు చేస్తూ, అద్దెకు సరఫరా చేస్తున్నారు. ఆహారం, నీటి కల్తీకి సంబంధించిన చట్టాలు, నిబంధనలేవీ వీరికి వర్తించవేమో అన్నట్లు వీరు వ్యవహారం సాగిపోవడం విశేషం.

నీటితోనే వ్యాపారం చేస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అనుమతుల్లేని, కనీస నాణ్యతాప్రమాణాలు, నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్లపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టి వాటిని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ప్రకారం వీరికి ఏవేవీ అనుమతులిచ్చారు?, ప్లాంట్‌లో నీటి శుద్ధి, వాటి సరఫరాలో అక్కడ పాటిస్తున్న నిబంధనలు, ఇతరత్రా అంశాలపై చర్యలు సంబంది నగర పాలక సంస్థ, ఫుడ్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ, పోలీసు, వైద్యఆరోగ్యశాఖలు దృష్టి పెట్టి తగు ర్యలు తీసుకోవాలని కోరుతున్నారు నియంత్రించాల్సి అధికారయంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు మౌనంగా ఉంటే ప్రజల ప్రాణాలకు భరోసా ఎవరిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.దీనిపై సంబంధిత అధికారుల స్పందన, చర్యలు ఎలా ఉంటాయో చూడాలి.

నేరాలు ఘోరాలు

చీడికలో వ్యక్తి హత్య

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని దోసలపాడు అగ్రహారం గ్రామానికి చెందిన కొల్లి సూరిబాబు (49) గురువారం హత్యకు గురయ్యాడు. గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామానికి ఆనుకుని వున్న చీడిక గిరిజన గ్రామం కొండలకు వెళ్లే ప్రాంతంలో సూరిబాబు మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారాన్ని తెలియజేశారు. సీఐ అప్పన్న, ఎస్ఐ శిరీష సంఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సూరి బాబు తలపై గాయాలు వుండటంతో హత్యకు గురైనట్టుగా పోలీసులు భావిస్తున్నారు. క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరిస్తున్నారు .హత్యకు సంబంధించి అన్ని కోణాల నుంచి దర్యాప్తు చేస్తున్నామని సీఐ అప్పన్న, ఎస్ఐ శిరీష తెలిపారు.

విద్యార్థులకు గణితంలో చిట్కాలు



గణితంలో మెళకువలు నేర్పుతున్న శ్రీనివాస రావు

ప్రజాశక్తి -తగరపువలస: చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ఉచిత శిక్షణ పొందుతున్న విద్యార్థులకు జివిఎంసి రాయిపాలెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరావు గురువారం గణితంలో మెలుకువలు నేర్పారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకులు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, ఎస్.పైడిరాజు పాల్గొన్నారు. అనంతరం గణితం ఉపాధ్యాయులు శ్రీనివాసరావును సత్కరించారు

హతురాలి కుటుంబాన్ని ఎమ్మెల్సీ పరామర్శ



మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కల్యాణి

ప్రజాశక్తి - ఆరిలోవ :నగరంలోని ద్వారకానగర్ మూడోలైన్‌లోని ఓ విద్యాసంస్థలో హత్యకు గురైన సువ్వాడ సుజాత కుటుంబాన్ని ఎంఎల్‌సి వరుదు కల్యాణి గురువారం పరామర్శించారు. ఆరిలోవ, టిఐసి పాయింట్, క్రాంతినగర్‌లో నివాసం ఉంటున్న సుజాత తల్లిదండ్రులు కృప, జయాకర్, పిల్లలు శశికళ, జశ్వంత్‌లను కలిసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి కల్యాణి మాట్లాడుతూ మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టి, నిందితుడు ఉమామహేశ్వరరావుకు త్వరితగతిన శిక్షపడేలా చూస్తామన్నారు. మృతురాలి పిల్లల పోషణ, విద్య విషయమై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతానన్నారు.దిశ ఎసిపి సిహెచ్.వివేకానంద, ద్వారకా సిఐ సింహాద్రినాయుడు, ఆరిలోవ సిఐ సోమశేఖర్ ఉన్నారు.

వహీదా రెహమాన్‌కు అభినందన



అభినందన కార్యక్రమంలో కళా సేవాపీఠం సభ్యులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : దాదాసాహెబ్‌ఫాల్కే జీవితసాఫల్య పురస్కారం అందుకున్న ప్రముఖ చలనచిత్ర నటి వహీదా రెహమాన్‌కు గోపాలపట్నం సేవా కళాపీఠం అభినందనలు తెలిపింది. గురువారం 92వ వార్డు గోపాలపట్నంలో కళాపీఠం అధ్యక్షులు గోరకల రామదాసు అధ్యక్షతన జరిగిన సభలో వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరపు సోములు మాట్లాడుతూ, దక్షిణాది నుంచి బాలీవుడ్‌కు వెళ్లి,అందం కంటే అభినయంతో నాటితరం ప్రేక్షకుల్లో గుర్తింపు పొందిన నటీమణి వహీదాకు, విశాఖతో అనుబంధం ఉందన్నారు. కొంతకాలం నగరంలోనే ఉన్నారన్నారు. మాజీ అధ్యక్షులు చందు సుబ్బారావు మాట్లాడుతూ తెలుగులో మొదటి శతదినోత్సవం చిత్రం జయసింహలో ఎన్‌టిఆర్ సరసన హీరోయిన్‌గా నటించిన వహీదా, తర్వాత రోజులు మారాయి చిత్రంలో ఏరువాక సాగారో పాటలో అభినయంతో ఆమె పేరు మారుమోగిపోయిందన్నారు. కత్తి కాంతారావు హీరోగా 'కన్యాదానం' చిత్రంలో రెండు పాటల్లో నటించినా అదిప్లాఫ్ అయింది. తమిళంలో రెండు చిత్రాల్లో నటించిన వహీదా, హైదరాబాదీ నటుడు, దర్శకనిర్మాత గురుదత్త దృష్టిలో పడడం, బాలీవుడ్ ఆఫర్లు రావడం,వ్యాసా చిత్రంలో వేశ్యపాత్రతో వచ్చిన గుర్తింపుతో కెరీర్‌కు తిరుగులేకుండా పోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలు అందుకున్న వహీదా ఎనిమిది సార్లు ఫిలింఫేర్ అవార్డులు, 2006లో ఎన్‌టిఆర్ పురస్కారం అందుకుందన్నారు. తాజాగా దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో నటిగా ఎవరికీ అందనంత ఎత్తుకు చేరిందని కొనియాడారు. కార్యక్రమంలో సేవా పీఠం ఉపాధ్యక్షులు గంపల అప్పారావు, ప్రధాన కార్యదర్శి డి సింహాచలం నాయుడు, కోశాధికారి భాస్కర్ పాణిగ్రహి, ఎల్లపు రమణ, ఎ.నారాయణరావు, ధన్పాల్ గజేంద్ర, గోరపల్లి బంగార్రాజు, రామచంద్రరావు, బండారు శ్రీనివాస్, మిద్దె అప్పారావు , తాండ్రంగి రామారావు పాల్గొన్నారు.

నేడు కృష్ణాకాలనీలో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి -భీమునిపట్నం: జివిఎంసి ఒకటో జోన్, మూడో వార్డు బొగ్గురోడ్డు సచివాలయంలో ఈ నెల20న శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించ నున్నట్లు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ప్రకటనలో తెలిపారు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిపుణులైన వైద్యులతో ఉచిత వైద్యపరీక్షలు, మందులు అందజేస్తారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు రైతులకు పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-పద్మనాభం : మండల కేంద్రంలో రైతులకు ఈనెల 20న గురువారం పట్టాలు పంపిణీ చేయనున్నారని తహశీల్దార్ వేణుగోపాలరావు తెలిపారు.స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని, రైతులకు పట్టాలను అందజేస్తారన్నారు.

వెండి ఆభరణాలు బహూకరణ

ప్రజాశక్తి -పిఎం పాలెం :పిఎం పాలెం ఆఖరి బస్‌స్టాప్ వద్ద ఉన్న పద్మసాయి ఆలయానికి బాబా సేవకు పిఎం.పాలేనికి చెందిన కంటి నాగరాజేష్, సుస్మిత దంపతులు గురువారం వెండి కుందులు, వెండి పళ్లెం బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, కార్యదర్శి పిన్నింటి రాంబాబు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్యంతో సాగు ఖర్చు తగ్గుదల

పలు గ్రామాల్లో పొలంబడి... రైతులకు వ్యవసాయ సూచనలు చేసిన అధికారులు



పొలంబడిలో రైతులకు సూచనలు చేస్తున్న ఎఒ శివకోమలి

ప్రజాశక్తి -తగరపువలస : వరి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గుతాయని మండల వ్యవసాయ శాఖాధికారి బి శివకోమలి రైతులకు సూచించారు. గురువారం భీమిలి మండలం, సింగనబందలో పొలంబడి నిర్వహించారు. రైతులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితులో ఎంటియు 1121, అన్నపూర్ణ రకం వరిపైర్లకు పొడతెగులు ఆశించినట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించామన్నారు. దీని నివారణకు హెక్సాకొనాజోల్ 400 మిల్లీలీటర్ల ద్రావణం ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. ఆకుముడత పురుగు నివారణకు ఎసిఫేట్ 300 గ్రాముల ద్రావణాన్ని ఎకరాకు పిచికారి చేయాలన్నారు.

అనంతరం రైతులకు సమగ్ర పురుగు నివారణ కిట్లను అందజేశారు వరిపొలాల్లో కాలిబాటలు తీయడం ద్వారా పైర్లకు గాలి, వెలుతురు తగిలేలా చర్యలు చేపట్టడం ద్వారా చీడపీడలు, తెగుళ్ల నివారణతోపాటు పైర్లు ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఎల్.హరీష్, బి రమేష్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన

పద్మనాభం: మండలంలోని గంధవరం గ్రామంలో స్థానిక ఎఇ ఎంవి.చలం ఆధ్వరంలో పొలంబడి నిర్వహించారు. ఈసందర్భంగా వరిపైర్లలో ఆకుముడత తెగులు నివారణపై రైతలుకు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బొడ్డేపల్లి విజయప్రసాద్ పలు సూచనలు చేశారు.

అనంతరం పాండ్రింగిలోని వరిపైర్లను క్షేత్రస్థాయలో పరిశీలన జరిపి, పొడతెగులు, సుడిదోమ ఆశించినట్లు గుర్తించి, సస్యరక్షణకు సూచనలు చేశారు.

స్వచ్ఛ క్యాంపస్‌గా ఎయు

-విద్యార్థుల భాగస్వామ్యంతో స్వచ్ఛతా హీ సేవ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : పరిశుభ్ర క్యాంపస్‌గా ఎయును తీర్చిదిద్దాలని, దీనిలో విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో కీలకమని వర్సిటీ విద్య విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు అన్నారు. గురువారం ఎయు విద్య విభాగంలో ప్రధాని మోడీ పిలుపును స్వాగతిస్తూ స్వచ్ఛతా హిసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని పరిసరాలను విద్యార్థులు, ఆచార్యులు స్వయంగా శుభ్రం చేశారు. వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దాలనే లక్ష్యానికి అనుగుణంగా ఎయులో పరిశుభ్రతా పనులు చేపట్టామన్నారు.కార్యక్రమంలో డాక్టర్ నాగరాజ కుమారి, విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత క్రీడాసక్తి పెంచుకోవాలి



పోటీలను ప్రారంభిస్తున్న నర్సింగరావు

ప్రజాశక్తి- గాజువాక : క్రీడల పట్ల యువత ఆసక్తి కనబరచాలని కెవిఆర్ ఫౌండేషన్ అధినేత కరణం రెడ్డి నర్సింగరావు అన్నారు. గురువారం గంగవరం బడివారి వీధి మైదానంలో బిఎస్ఎన్ఎల్ యూత్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వింద్‌బాల్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువారం నుంచి శుక్రవారం వరకు నాలుగురోజుల పాటు పోటీలు జరుగుతాయన్నారు. విజేతగానిలిచిన జట్టుకు రూ.ఆరు వేలు, రన్నరప్‌కు రూ.నాలుగు వేలు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.మూడు వేలు, రూ.రెండు వేలు నగదు ప్రోత్సాహక బహుమతులతోపాటు ట్రోఫీలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పేర్ల అప్పారావు, నిర్వాహకులు బడి.తాతారావు, పేర్ల ధనరాజు, నూకరాజు, తరుణ్, రాజు పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధ్యాపకులు, రిసోర్స్‌పర్సన్స్

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస, అనిల్ నీరుకొండ వైద్య విద్యాసంస్థలో "బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్' అంశంపై ఈ నెల 17న ప్రారంభమైన వర్క్ షాప్ గురువారంతో ముగిసింది. ఆంధ్ర వైద్య కళాశాల సౌజన్యంతో, ఎన్ఎంసి నియమించిన అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ రామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో 28 మంది మెడికల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నూతన విధానంలో వైద్యవిద్యను ఎలా బోధించాలో శిక్షణ ఇచ్చారు.కళాశాల డీన్ డాక్టర్ పివి సుధాకర్ అధ్యక్షతన జరిగిన శిక్షణలో ఎంఇయుకో ఆర్డినేటర్ డాక్టర్ బి .ప్రీతి, కరికులం కమిటీ కన్వీనర్ డాక్టర్ జగదీష్, 12 మంది సీనియర్ అధ్యాపకులు రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరించారు

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినులు

ప్రజాశక్తి -పిఎం పాలెం : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మధురవాడ సమీపంలోని సాంకేతిక విద్యాపరిషత్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు గురువారం చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో వంద మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు వచ్చేనెల 14న బాలల దినోత్సవం రోజున బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రాహుల్ అల్వార్‌దాస్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధు భట్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జె ఆనంద్ చందులాల్, అడ్మిషన్ ఆఫీసర్ ఎ.నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్‌సి అనిల్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మానవ హితంగా జీవశాస్త్ర పరిశోధనలు

గీతం సదస్సులో ప్రముఖ శాస్త్రవేత్తలు



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శశిధర

ప్రజాశక్తి- మధురవాడ : వివిధ రుగ్మతలకు మూలాలను శోధించడంతో పాటు, మానవాళి శ్రేయస్సును కోరేలా జీవశాస్త్ర పరిశోధనలు చేపట్టాలని ప్రముఖశాస్త్రవేత్తలు డాక్టర్ రాకేష్‌మిశ్రా, ప్రొఫెసర్ ఎల్ఎస్.శశిధర పిలుపు నిచ్చారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ సైన్స్ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నేషనల్ సెంటర్ ఫర్ బయలాజికల్ సైన్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్.ఎస్.శశిధర మాట్లాడుతూ మానవ పరిణామక్రమంలో జన్యుపరంగా వచ్చిన మార్పులను, ప్రస్తుత ప్రపంచంలో మనిషికి, జంతువులకు, క్రిమికీటకాలకు గల వ్యత్యాసాన్నివివరించారు. జీవశాస్త్ర పరిశోధకులు తమ అధ్యయనాలను ఏవిధంగా చేపట్టాలో సూచించారు.

టాటా ఇనిస్టిట్యూట్ ఫర్ జెనిటిక్స్ అండ్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ రాకేష్‌మిశ్రా మాట్లాడుతూ మానవ జన్యువులలో లోపాలను సరిదిద్దడం, పంటల దిగుబడి పెంచే పరిశోధనలు జరపడం, వివిధ రోగాల నివారణకు జన్యుపరమైన పరిష్కారం చూపడం వంటి వాటిపై తమ కేంద్రం పరిశోధనలు చేస్తోందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కృష్ణ మాట్లాడుతూ వివిధ విభాగాల మధ్య పరస్పర సహకారంతో చేపట్టే పరిశోధనలతో శాస్త్ర విజ్ఞానం పురోభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేదవతి, వివిధ విభాగాల సీనియర్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై మరో ఉద్యమం



గంగవరంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఐ నేతలు

ప్రజాశక్తి -గాజువాక : పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించేలా మరో ఉద్యమం చేపడతామని సిపిఐ నేతలు హెచ్చరించారు. గురువారం సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు గంగవరం గ్రామంలో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా సిపిఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ సంస్కరణలను తుచ తప్పకుండా పాటిస్తూ, రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలను ఇష్టానుసారంగా పెంచేస్తూ వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తామన్నారు. ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలను పెంచేది లేదంటూ హామీనిచ్చిన ముఖ్యమంత్రి గడచిన నాలుగున్నరేళ్ల ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి వినియోగదారులపై వేల కోట్ల భారం వేశారన్నారు. ఇదిచాలదన్నట్లు ఎపుడో పదేళ్ల క్రితం వాడిన కరెంట్‌కు ఇపుడు ట్రూఅప్, సర్దుబాటు, ఇంధన సర్‌ఛార్జీలంటూ ప్రతినెలా బిల్లులపై అదనపు ఛార్జీలను వేసి వసూలు చేయడం దుర్మార్గమన్నారు. సామాన్య వినియోగదారులే కాకుండా చిరు వ్యాపారులు, మధ్యతరగతి ప్రజలపై మోయలేని విద్యుత్ ఛార్జీల భారం వేసిన వైసిపి ప్రభుత్వం వెంటనే తాను చేసిన తప్పును తెలుసుకుని, కరెంట్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేయడంతోపాటు రానున్న ఎన్నికల్లో సిఎం జగన్‌కు తగిన గుణపాఠం చెప్పేలా ప్రజలను సమాయత్తం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నేతలు పల్లేటిపోలయ్య, పి.దుర్గారావు, కె.పోతన్న, సోమేష్ , మాధవరావు, వై. నందన్న, మహిళా సమాఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స



మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి బొత్స

ప్రజాశక్తి - ఆనందపురం: రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. గురువారం పెద్దిపాలెం చెన్న ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ, వాలంటీర్ల వ్యవస్థతో సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు అందించిన ఘనత జగన్‌దేనన్నారు. రాష్ట్రంలో అమలౌతున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఎదురులేదని, పార్టీ కేడర్ మరింత ఉత్సాహంగా పనిచేయాలన్నారు.కార్యక్రమంలో వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.బాలరాజు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నందీష్, కోలా గురువులు, భీమిలి ఎంపీపీ వాసురాజు, భీమిలి మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, వైస్ ఛైర్మన్ బోని అప్పలనాయుడు, జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యం, మజ్జి వెంకటరావు, బంటుబిల్లి మణిశంకర్ నాయుడు కాకర్లపూడి శ్రీకాంత్ రాజు,పాండ్రంకి శ్రీను, బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ, గనిరెడ్డి శ్రీను బిఆర్‌బి.నాయుడు, లంక రాంబాబు, సిహెచ్.పాత్రుడు, చెన్న రామారావు వెంకటేష్ పాల్గొన్నారు

బాలకృష్ణ అభిమానుల సందడి



కేక్ కట్ చేస్తున్న బాలయ్య అభిమానులు

ప్రజాశక్తి-తగరపువలస : సినీహీరో బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి సినిమా విడుదల సందర్భంగా గురువారం స్థానిక శ్రీ రాములమ్మ సినిమా థియేటర్ వద్ద నందమూరి అభిమానులు సందడి చేశారు. బాణ సంచా కాల్చి, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ అభిమానులు గ రే సదానంద, చోడి వినోద్‌కుమార్, శ్రీను మోహన్ పాల్గొన్నారు

గ్లోబల్ మేరీ టైం ఇండియా సమ్మిట్‌లో

విశాఖ పోర్టు స్టాల్‌కు విశేష స్పందన



మంత్రి అమర్ సమక్షంలో పోర్టు ప్రతినిధుల ఎంఒయు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ముంబైలో జరుగుతున్న గ్లోబల్ మేరీటైం ఇండియా సమ్మిట్ 2023లో పలు ప్రఖ్యాత సంస్థలతో విశాఖపట్నం పోర్టుఅథారిటీ ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖపట్నం పోర్టుట్రస్ట్ తరపున ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు , డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దుబే పాల్గొని వివిధ సంస్థల ప్రతినిధులతో కలిసి పరస్పర అంగీకార పత్రాలపై సంతకాలు మార్చుకున్నారు.

17న ప్రధాని నరేంద్రమోడీ వర్చువల్‌గా ప్రారంభించిన సమ్మిట్ మూడు రోజులపాటు జరిగి, గురువారంతో ముగిసింది. సమ్మిట్‌లో విశాఖపట్నం పోర్టు ఏర్పాటు చేసిన స్టాల్ అందరినీ అమితంగా ఆకట్టుకుంది. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన 5వేల మందికిపైగా ప్రతినిధులు విశాఖ పోర్టు స్టాల్ ను సందర్శించారు. కేంద్ర పోర్టు నౌకాయాన జలరవాణా శాఖ మంత్రి శరబానంద సోనోవాల్, సహాయ మంత్రులు శ్రీపాద యశోనాయక్, శాంతను ఠాకూర్, సెక్రటరీ షిప్పింగ్ టికె. రామచంద్రన్ పలు ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులు విశాఖ పోర్టు స్టాల్‌ను సందర్శించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమ్మిట్‌లోడ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎపి మ్యారీటైం బోర్డులు కూడా స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి.

సమస్యల పరిష్కారానికి వినతి



కమిషనర్‌కు సమస్యలు విన్నవిస్తున్న కార్పొరేటర్ హేమలత

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఐదోవార్డులో తిష్టవేసిన దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ మొల్లి హేమలత కోరారు. గురువారం కౌన్సిల్ సమావేశంలో కమిషనర్ సాయికాంత్‌వర్మకు, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారికి వినతిపత్రం అందజేశారు. 5,6,7,8 వార్డులకు ప్రధానకూడలి అయిన మధురవాడ ఫ్లైఓవర్ వంతెన వద్ద చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిల్వ ఉండి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఈ కూడలి మీదుగా జివిఎంసి జోనల్ కార్యాలయం, పిహెచ్‌సి, విద్యుత్ కార్యాలయం, చంద్రంపాలెం ఉన్నత పాఠశాల, పోలీస్‌స్టేషన్, మధురవాడ మార్కెట్, రైతుబజారుకు స్థానిక ప్రజలు వెళ్లాలంటే ఈ కూడలి దాటి ఇబ్బందులు పడుతూ వెళ్లాల్సిన దుస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా కొమ్మాది జంక్షన్ నుంచి చంద్రంపాలెం వరకు సర్వీస్ రోడ్డుపై వర్షపు నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. వార్డులోని బొట్టవానిపాలెం, నగరంపాలెం చెరువులు ఆక్రమణలకు గురికాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, జెఎన్ఎన్‌యు ఆర్ఎం కాలనీ, రాజీవ్ గృహకల్ప, ఎన్‌టిఆర్ హుదూద్ కాలనీ, తదితర కాలనీలకు తాగునీరు, రహదారులు, యుజిడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. జలజీవన్ మిషన్ అయ్యప్పనగర్ తాగునీటి ప్రాజెక్టులో భాగంగా వికలాంగుల కాలనీ, డ్రైవర్స్ కాలనీ, కార్పెంటర్స్ కాలనీ ప్రాంతాలకు పైపులైన్ల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విన్నవించారు.వార్డులో వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి బిసిసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కళాశాల నిర్వహిస్తున్న పట్టణంలోని సాయి కుల్వంత్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలపై కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావుకి విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి కళాశాల తీరుపై వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరమణ మాట్లాడుతూ సాయి కుల్వంత్ కాలేజ్ యాజమాన్యం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, పనిష్మెంట్ పేరుతో డబ్బులు వసూలు చేస్తుందని తెలిపారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, పబ్లిక్ హాలిడేస్‌లో కూడా సెలవు ప్రకటించకుండా కళాశాల నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కాల పరిమితికి మించి కళాశాల నిర్వహిస్తున్నారన్నారు. ఈ సమస్యలపై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఆర్ఐఓ గాని, స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారిగాని చర్యలు తీసుకోలేదన్నారు. అధికారుల తీరుపైకూడా విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం రమణ, జిల్లా ట్రెజరర్ గొర్లి తరుణ్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శివాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు


చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

ఎర్ర చెరువు అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని కొత్తూరు ఎర్ర చెరువు అభివృద్ధి పనులను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ గురువారం పరిశీలించారు. చెరువులు పూర్తిస్థాయిలో శుభ్రపరిచి, దాని చుట్టూ బండ్ ఏర్పాటు చేసే కార్యక్రమం శరవేగంగా జరుగుతోంది. బండ్ వెంబడి మొక్కలు నాటే కార్యక్రమం కూడా చురుకుగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో మంత్రి అమర్నాథ్ చెరువు వద్దకు చేరుకొని అభివృద్ధి పనులను పరిశీలించారు. నిర్వాహకులకు కొన్ని సూచనలు సలహాలు కూడా ఇచ్చారు. పనులు వీలైనంత త్వరగా పూర్తి కావాలని మంత్రి అమర్నాథ్ వారిని కోరారు. కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యుసీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు భీశెట్టి వరాహ సత్యవతి, ఎంపీపీ సూరిబాబు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మల్ల బుల్లిబాబు, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్ తదితరులు పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య సూర్యప్రకాశరావు

లా వర్సిటీ వీసీగా ఆచార్య సూర్యప్రకాశరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- సబ్బవరం

స్థానిక దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ నూతన ఉపకులపతిగా ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. విశ్వవిద్యాలయ కులపతి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఉత్తర్వుల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ న్యాయ శాఖ సూర్యప్రకాశరావు నియామక జీఓ జారీ చేసింది. ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు ప్రస్తుతం ఆంధ్ర యూనివర్సిటీలో గౌరవ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆయన 36 సంవత్సరాలు ఎయు అంబేద్కర్ లా కళాశాలలో అధ్యాపకునిగా, ప్రిన్సిపాల్‌గా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, ఫ్యాకల్టీ చైర్మన్‌గా పని చేశారు. మహారాష్ట్ర నాగపూర్ నేషనల్ లా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో గతంలో ఒక సబ్జెక్టును ఏడాది పాటు బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యా బోధన, పరిశోధన, పరిపాలన అంశాలపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయనకు విశ్వవిద్యాలయ అధ్యాపకులు అధ్యాపకేతరులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీసుధ, రిజిస్ట్రార్ డాక్టర్ జోగి నాయుడు, హైకోర్టు జడ్జి మన్మధరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 13,259 మందికి 'జగనన్న చేదోడు'

ప్రజాశక్తి-అనకాపల్లి

జగనన్న చేదోడు పథకం కింద జిల్లాలో 13,259 మంది లబ్ధిదారులకు రూ.13 కోట్ల 25 లక్షల 90 వేలు అందజేసినట్లు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ రవి పట్టన్ శెట్టితో కలిసి జగనన్న చేదోడు చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ కులవృత్తుల వారిని ఆదుకున్న ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అంతకుముందు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి చేదోడు పథకంలో రాష్ట్రంలోని లబ్ధిదారులకు రూ.10 వేల చొప్పున వరుసగా 4వ విడత ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారాన్ని అందరూ వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జిఎస్‌డబ్ల్యుఎస్ ప్రత్యేక అధికారి మంజులవాణి, బీసీ కార్పొరేషన్ ఇఒ వి.రమణమ్మ, ఏబీసీడబ్ల్యుఒ సురేష్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు


చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, కలెక్టర్

'నేవీ' కార్మికులకు బోనస్ చెల్లించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దేవుడునాయుడు



ఆందోళన చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-రాంబిల్లి

నేవీ నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులందరికీ ఒక నెల జీతం బోనస్‌గా చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేవుడునాయుడు, మండల కన్వీనర్ చందక రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని నేవీ మెయిన్ గేటుకు సమీపంలో కార్మికులకు బోనస్ చెల్లించాలని కరపత్రాలు పంపిణీ చేసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేవీ నిర్మాణ పనులు చేస్తున్న ఎల్ అండ్ టి-1, 2 వర్కర్స్‌తో పాటుగా సబ్ కాంట్రాక్ట్ వర్కర్స్‌కు, కెఇసి, ఎస్ఎలిస్, డిఆర్‌డిఒ పరిధిలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు దసరా, దీపావళి పండగలు సందర్భంగా బోనస్ చట్టం ప్రకారం ఒక నెల జీతం బోనస్‌గా చెల్లించాలని డిమాండ్ చేశారు. రోజుకు 12 గంటల పాటు కార్మికుల చేత పని చేయించుకుంటున్న యాజమాన్యాలు, వారికి పండగ బోనస్ చెల్లించకపోవడం దారుణమన్నారు. బోనస్ చెల్లించని కంపెనీ యజమాన్యాలపై చర్యలు తీసుకొని, కార్మికులకు బోనస్ ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని విశాఖపట్నం సెంట్రల్ లేబర్ కమిషనర్‌కు తెలియజేశామని చెప్పారు. కార్మికులంతా ఐక్యంగా యాజమాన్యాలపై ఒత్తిడి తెచ్చి బోనస్ సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మికులు డి.అప్పలరాజు, సిహెచ్.నూకన్న, చిట్టిబాబు, రాజు, అప్పారావు, శ్రీను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రద్దీ ప్రాంతాలకు బస్సులు వేస్తాం

ప్రజాశక్తి-కె.కోటపాడు

ఆర్టీసీకి ఆదాయం వచ్చే రూట్లలో తప్పనిసరిగా బస్సులు వేస్తామని ఏపిఎస్ఆర్‌టిసి మద్దిలపాలెం డిపో ఎడిసి శ్రీరామ్మూర్తి తెలిపారు. గురువారం మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే దేవరాపల్లి నుండి ఆనందపురం హనుమంతవాక మీదుగా ఆర్కే బీచ్‌కు 68-డి పేరుతో ఆరు బస్సులు వేసినట్లు చెప్పారు. దేవరాపల్లి నుండి కె.కోటపాడు మీదుగా విశాఖకు మరిన్ని బస్సులు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు కోరారని చెప్పారు. 333/300సి పేరుతో విశాఖ నుండి కె.కోటపాడు, ఎ.భీమవరం, గవరవరం మీదుగా చోడవరం ఒక ట్రిప్పు వేయడం జరుగుతుందన్నారు. లంకవానిపాలెం పిహెచ్‌సికి రోగులు ఎక్కువగా బస్సుల్లో వస్తున్నారని, సిహెచ్‌సి వద్ద బస్టాప్ ఏర్పాటు చేయాలని సభ్యులు ఎప్పటినుండో కోరుతున్నారని, వీటన్నింటిపై డిపో అధికారులకు తెలియవరుస్తానని తెలిపారు.

డిప్యూటీ సిఎంను కలిసిన నూతన ఆర్‌టిఒ

ప్రజాశక్తి-దేవరాపల్లి

గ్రూప్-1 పరీక్షల్లో అర్హత సాధించి అనకాపల్లి జిల్లా రవాణా శాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మన్యం జిల్లా సాలూరుకు చెందిన జి.మనోహర్ గురువారం ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును గురువారం తారువలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు రవాణా భద్రత అంశాలపై చర్చించారు. ఆయన వెంట మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కెవి.ప్రకాష్ ఉన్నారు.

ఎంపీని...

అనకాపల్లి : జిల్లా రవాణా అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మనోహర్ గురువారం అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి.సత్యవతిని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.


డిప్యూటీ సిఎం బూడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్‌టిఒ మనోహర్

రాష్ట్రంలో పోలీసు పాలన : నాగజగదీష్

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో పోలీస్ పాలనతో ప్రజలు, ప్రతిపక్షాలకు జీవించే హక్కు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. స్థానిక రింగ్ రోడ్‌లో పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ నాయకుడు చంద్రబాబు నాయుడును రాజకీయంగా ఎదుర్కోలేక కేసుల మీద కేసులు పెట్టి ఎన్నికల వరకు జైల్లోనే ఉంచాలని కుట్రతో జగన్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేలా ఆంధ్రప్రదేశ్ అంతటా సెక్షన్ 144 సబ్ డివిజన్లో పోలీస్ యాక్ట్ 30ను ఉపయోగించి, తెలుగుదేశం పార్టీ, జనసేన ఇతర రాజకీయ పార్టీలను రాష్ట్రంలో తిరగనీయకుండా జగన్ రెడ్డి ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేశారని, వచ్చే ఎన్నికల్లో వైసిపిని గెలిపిస్తే రాష్ట్రంలో ప్రజలు స్వేచ్ఛగా జీవించే హక్కు లేకుండా పోతుందని, జగన్ రెడ్డికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ నారాయణరావు, పార్లమెంట్ అధికార ప్రతినిధి కడిమిశెట్టి నరసింగరావు, పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ, బీసీ సెల్ అధికార ప్రతినిధి విల్లూరి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖాదీ వస్త్రాల ప్రదర్శన

ప్రజాశక్తి-చోడవరం

ఖాదీ మహోత్సవం సందర్భంగా స్థానిక డిగ్రీ కాలేజీ వద్ద ఖాదీ వస్త్రాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బి కిరణ్ కుమార్, స్థానిక వస్త్ర వ్యాపారి పసుమర్తి సాంబశివరావు సౌజన్యంతో ఖాదీ వస్త్రాల ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఖాదీ వస్త్రాలను కొనుగోలు చేయడం వలన ఆరోగ్యమే కాకుండా చేనేత కార్మికులకు, స్థానికులకు ఉపాధి కలిగించిన వారం అవుతామని, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి వారిని ప్రోత్సహించాలని కోరారు. సీనియర్ అధ్యాపకులు జి సత్యనారాయణ, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు వస్త్రాలను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్పిఒ డాక్టర్ వి రత్నభారతి, బిచ్చుమ్మ, డి.మాల్యాద్రి, సీనియర్ అధ్యాపకులు సిహెచ్.సుధీర్, ఎస్.ఎం.రఫుద్దీన్, ఐవీ సత్యవతి, డాక్టర్ లక్ష్మీ మంగమ్మ, వి అప్పలనాయుడు, డాక్టర్ ఈ రాధాకృష్ణ, ఎ.కృష్ణారావు, జి వెంకటేష్, నారాయణమూర్తి, రామలక్ష్మి, సరస్వతి, కోమల, పిడి మూర్తి, శ్రీనివాసరావు, శర్మ పాల్గొన్నారు.


ఖాదీ వస్త్రాల ప్రదర్శన ఏర్పాటు చేసిన దృశ్యం

అంగన్వాడీ కేంద్రాల పనితీరు అధ్వానం

- మండల సమావేశంలో సభ్యుల నిలదీత
- తరచూ విద్యుత్ అంతరాయంపై మండిపాటు

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని అంగన్వాడీ కేంద్రాల పనితీరు అధ్వానంగా ఉందని మండల పరిషత్తు సమావేశంలో పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. గురువారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి రెడ్డి జగన్మోహన్ అధ్యక్షతన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలోని 75 అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారని, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం సరుకులు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని, చిన్నారుల సంఖ్య పెంచి చూపిస్తున్నారని వైస్ ఎంపిపి రొంగలి సూర్యనారాయణ, ఇతర సభ్యులు ఆరోపించారు. ప్రతినెలా చిన్నారుల హాజరు పట్టి ఆయా సచివాలయాల వద్ద ప్రదర్శించాలన్న నిబంధనలు ఎవరూ పాటించడం లేదన్నారు. దీనికి స్పందించిన సిడిపిఓ మంగతాయారు విధుల్లో నిర్లక్ష్యం వహించిన అంగన్వాడీ కార్యకర్తలపై తక్షణమే చర్యలు తీసుకుంటామని, వారి వేతనం నిలిపివేస్తామని సభ్యులకు హామీ ఇచ్చారు.

మల్లంపాలెం, పాచిలవానిపాలెం, గరుగుబిల్లి, లంకవానిపాలెం గ్రామాల్లో తరచూ విద్యుత్ అంతరాయం జరుగుతుందని, రెండు రోజులు విద్యుత్ లేకపోయినా సిబ్బంది పట్టించుకోవడం లేదని చౌడువాడ, లంకవానిపాలెం సర్పంచులు దాడి ఎరుకనాయుడు, వేచలపు దొరబాబు విద్యుత్ అధికారులను నిలదీశారు. ఆయా గ్రామాల్లో లైన్మెన్లను నియమించాలని కోరారు. చౌడువాడ హైస్కూల్ వద్ద ప్రభుత్వ బ్రాందీ షాపు ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు అసౌకర్యంగా ఉందని, తక్షణమే ఆ షాపును మార్చాలని పంచాయతీ తీర్మానం చేసిన పట్టించుకోవడం లేదని చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకనాయుడు ఆరోపించారు. ఈ సమావేశంలో జెడ్పిటిసి ఈర్లె అనురాధ, ఎంపిడిఓ శచిదేవి, తహసీల్దార్ రమేష్ బాబు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపిపి జగన్మోహన్, ఎంపిడిఒ శచిదేవి, తహశీల్దారు రమేష్‌బాబు



ర్యాలీ నిర్వహిస్తున్న మలేరియా విభాగం సిబ్బంది

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని ముత్యాలమ్మపాలెం పంచాయతీలో గ్రామ సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు సారథ్యంలో సీజనల్ వ్యాధుల నివారణపై గురువారం మలేరియా విభాగం వారు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని సర్పంచ్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా తదితర సీజనల్ వ్యాధులు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. పిహెచ్‌సి డాక్టర్ కనకఅప్పారావు మాట్లాడుతూ ప్రజలు తమ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తప్పనిసరిగా ఫ్రైడే, డ్రైడేను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుక్యూట్ పార్వతి, హెల్త్ సూపర్వైజర్లు వి సత్యనారాయణ, ధనలక్ష్మి, ఎఎన్ఎం దుర్గ, ఎంఎల్‌హెచ్‌పి వెంకటరత్నం, ఆశావర్కులు, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - పరవాడ

అర్హులందరికీ వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని రావాడ పంచాయతీ పరిధి ధర్మరాయుడు పేట, ఇందిరమ్మ కాలనీ, కావలి వారు చేలు తదితర ప్రాంతాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేపట్టారు. ప్రతి కుటుంబంతో మాట్లాడి జగనన్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావాడ పంచాయతీ పరిధిలో వైసిపి ప్రభుత్వం 31 కోట్ల 34 లక్షల రూపాయలు సంక్షేమ పథకాలు ద్వారా ప్రజలకు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, జెడ్పిటిసి పైల సన్యాసిరాజు, వైస్ ఎంపిపి బంధం నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు కోన రామారావు, నాయకులు కావలి రాజు, అప్పలరాజు, కావలి వాసు, జమ్ముల అశోక్ కుమార్, పల్లా గోవింద్, ఇఓపిఆర్డి రమేష్ నాయుడు, పిఆర్ ఎఇ గండి రామారావు, హౌసింగ్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ షణ్ముఖ, విఆర్ఓ బుజంగరావు పాల్గొన్నారు.

పంచకర్లకు దుర్గాప్రసాద్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి- సబ్బవరం

జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన పంచకర్ల రమేష్‌బాబును విశాఖపట్నం సీతమ్మధారలోని ఆయన స్వగృహంలో ఆ పార్టీ సబ్బవరం మండల నాయకుడు గండి దుర్గాప్రసాద్ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రెండు పర్యాయాలు శాసనసభ్యులుగా పని చేసిన పంచకర్ల రమేష్ బాబును ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడుగా నియమించడం పట్ల పార్టీ శ్రేణులు అభిమానులు స్వాగతిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో రమేష్ బాబు సారధ్యంలో రాబోయే ఎన్నికలలో జనసేన పార్టీ సత్తా చూపబోతుందని తెలిపారు.



పంచకర్లకు పుష్పగుచ్ఛం అందిస్తున్న దుర్గాప్రసాద్

సాంకేతిక సహాయంతో భూగర్భ జల నిర్వహణ

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తదితరులు

ప్రజాశక్తి- అనకాపల్లి

గూగుల్ ఆధునిక సాంకేతిక సహాయంతో భూగర్భ జలాలను పసిగట్టి వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో ఇండో జర్మన్ ద్వైపాక్షిక ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో వాతావరణ మార్పులు, వర్షాభావం కారణంగా ప్రకృతి సిద్ధమైన జలాలు తగ్గిపోతున్నాయని తెలిపారు. భూగర్భ జలాలు ఎక్కువగా ఉపయోగిస్తున్నారని చెప్పారు. ఇటువంటి పరిస్థితులలో తాగు నీరు, సాగు నీరు అందరికీ అందుబాటులో ఉండాలంటే జల వనరుల అన్వేషణ, జలాశయాల నిర్వహణ ఎంతో ఆవశ్యకమన్నారు. కాబట్టి అందుబాటులో ఉన్న జలాలను పొదుపుగా వాడటం, జలరాసులను కనుగొని తగిన విధంగా వినియోగించడం ఎంతో అవసరమన్నారు. దీనికి ఆధునిక సాంకేతిక విజ్ఞానం పట్ల అవగాహన ముఖ్యమని చెప్పారు. ఈ వర్క్ షాప్‌లో జల నిర్వహణ - జలాల లభ్యతపై తెలియజేసే విషయాలను అవగతం చేసుకొని డ్వామా, ఇంజనీరింగ్ శాఖలవారు ప్రజలకు ముఖ్యంగా రైతులకు ఉపయోగపడే విధంగా భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అనకాపల్లి జిల్లాలో నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితిని, వాటిని ఏ విధంగా ఉపయోగించుకుంటే బాగుంటుందో అనే విషయంపై పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ డాక్టర్ ఎం.అశోక్ కుమార్, భూగర్భజల టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌ఆర్.లక్ష్మి, టెక్నికల్ అడ్వైజర్ అమర్ సక్సేనా, సిపిఓ జి.రామారావు, వాటర్ రిసోర్సెస్ డిఈఈ రాజేంద్ర కుమార్, గ్రౌండ్ వాటర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రావు, డ్వామా పిడి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సముద్ర తీరంలో టిడిపి నిరసన



పూడిమడక తీరంలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా గురువారం మండలంలోని పూడిమడక సముద్ర తీరంలోని నీటిలో కెరటాల మధ్యన తెలుగుదేశం పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమం మాజీ ఎమ్మెల్యేలు బుద్ద నాగ జగదీష్, పప్పల చలపతిరావు, టిడిపి నాయకులు రాజాన రమేష్ కుమార్, ప్రగడ నాగేశ్వరరావు, జనపరెడ్డి నర్సింగరావు, టిడిపి నాయకులు మెరుగు బాబు నాయుడు, ఎంపిటిసి సభ్యుడు ఎన్ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని ఐతెంపూడి, గున్నెంపూడి గ్రామాలలో బాబుతో నేను కార్యక్రమాన్ని గురువారం టిడిపి చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గూనూరు మల్లునాయుడు, టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, నాయకులు దొంకిన అప్పలనాయుడు, అప్పన్న పైడినాయుడు, పడాల గోవిందా, ముచ్చకర్ల నాయుడు, ముచ్చకర్ల తాతీలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన : పల్లా

విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో అరాచక పాలన రాజ్యమేలుతుందని టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ గురువారం సాయంత్రం జిల్లా టిడిపి కార్యాలయం వద్ద కాగడాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నారా భువనేశ్వరి వద్దకు వెళ్లి సంఘీభావం ప్రకటించడానికి వెళ్తుంటే అడ్డుకోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాశర్ల ప్రసాద్, పుచ్చా విజయకుమార్, బొండా జగన్, పీలా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, బల్ల శ్రీనివాసరావు, పివి.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేస్తున్న నాటికలు


ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి గవరపాలెం కనకదుర్గ అమ్మవారి ఆలయం ఆధ్వర్యంలో గౌరీ సేవా సంఘం మల్ల జగన్నాథం కళ్యాణ మండపంలో కీర్తిశేషులు కర్రి రమేష్ జ్ఞాపకార్థం కర్రి సన్యాసినాయుడు ఆర్థిక సహాయంతో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాల్లో ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి. ఇందులో భాగంగా నాలుగో రోజు శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారి గమ్యస్థానాలవైపు నాటిక ప్రదర్శించారు. మూల కథ రావు కృష్ణారావు అందించగా గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. శ్రీస్నిగ్ధ నాటకీకరణ ఆకట్టుకుంది. ఈ నాటికలో కే విజయ, మోహన్ రావు, సురభి ప్రభావతి, ఎం మధు, గోపరాజు విజయ్ అద్భుతంగా నటించారు. కథాంసాన్ని పరిశీలిస్తే సమస్య చిన్నదైన పెద్దదైన మనిషి ఎదిరించి పోరాడాలని, అంతేగాని ఆత్మహత్య పరిష్కారం కాదని, అది హత్య గానే పరిగణించబడుతుందని తెలియచెప్పే నాటిక. ప్రధాన పాత్రలు రత్నాలు సత్తిబాబు అవరోధాలు అడ్డంకులు ఎదుర్కొని పోరాడే మనస్తత్వం. ఈ నేపథ్యంలో వెంకన్న, రాంబాబు కుటుంబాల తమకు ఎదురైన సమస్యలను పరిష్కరించుకోలేక ఆత్మహత్యలు చేసుకుందామనుకుంటున్న సమయంలో వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి వాళ్ల గమ్యస్థానాలకు పంపడంతో కథ ముగుస్తుంది.

దుర్గాదేవి అమ్మవారికి ఎంపీ పూజలు

ప్రజాశక్తి-అనకాపల్లి : దసరా మహోత్సవంలో భాగంగా అనకాపల్లి గవరపాలెం పార్క్ సెంటర్లో శివశక్తి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి అమ్మవారి ఉత్సవ కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి.సత్యవతి పాల్గొని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు మంగళ వాయిద్యాలతో పూర్ణకుంభంతో ఆమెకు సాదరంగా ఆహ్వానం పలికి వారిచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు పీలా రామచంద్రరావు, ఉపాధ్యక్షులు కాండ్రేగుల అప్పలనాయుడు, వాయినాల దాత ద్వారపూడి మురళి, రాఘవ, పోలమరశెట్టి సన్యాసినాయుడు, వార్డ్ కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్,పాల్గొన్నారు.

జివిఎంసి కమిషనర్ దృష్టికి 79వ వార్డు సమస్యలు


ప్రజాశక్తి - పరవాడ : జివిఎంసి 79వ వార్డు పరిధి లంకెలపాలెం ప్రాంత సమస్యలను ఆ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు గురువారం గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. లంకెల పాలెం జంక్షన్లో ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్, ఎయిర్ క్వాలిటీ మిషన్ ఏర్పాటు చేయాలని, వార్డులో ఓపెన్ ప్లేస్లో, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని, శానిటరీ సిబ్బంది కొరత తీర్చాలని, వార్డులో అభివృద్ధి పనులు చేయాలని ఆ వినతిపత్రం అందజేశారు.



జివిఎంసి కమిషనర్‌కు సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు


-డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి - చీడికాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం మండలంలోని జైతవరం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి, మంత్రి ముత్యాలనాయుడు మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో నాయకులు ప్రజలను నిలువునా దోచేశారని, పింఛన్లు మొదలు ఏది కావాలన్నా లంచాలు తినిపించి చేయించుకునే పరిస్థితి ఉండేదని తెలిపారు. జగన్ సిఎం అయ్యాక అలాంటి రోజులకు కాలం చెల్లి తెల్లవారు జామునే పోటా పోటీగా వాలంటీర్లు గ్రామ స్థాయి నుండి పింఛన్లు అందిస్తున్నారని తెలిపారు. ఏ అవసరం వచ్చినా గ్రామాల్లో ప్రజలకు వాలంటీర్ సేవలు అందిస్తున్నారని మంత్రి తెలిపారు. మాడుగులపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి ఉందనిజిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు అనురాధ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షులు యర్రా అప్పారావు, మాడుగుల నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు ఉరుకూటి అప్పారావు, మండల పరిషత్ అధ్యక్షురాలు కురచా జయమ్మ నారాయణమూర్తి, మండల జెడ్పీటీసీ లాలం శారద జానకీ రామ్, చీడికాడ మండల పార్టీ అధ్యక్షులు గొల్లవిల్లి రాజబాబు, యువజన విభాగం అధ్యక్షులు గోల్లవిల్లి స్వామినాయుడు, మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లే చైతన్య, మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు కురచా కుమారి, చీడికాడ మండల పరిషత్ ఉపాధ్యక్షులు, ధర్మిసెట్టి స్వాతి కొండబాబు, కిముడు చిన్నమ్మలు పాల్గొన్నారు.

మాడుగుల: మాడుగుల కేంద్రలో "జగనే ఎందుకు కావాలంటే"పై సమీక్ష సమావేశం జరిగింది. గురువారం సాయంత్రం పరమేష్ గోడౌన్లో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు పాల్గొని ప్రసంగించారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు నేరుగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. వార్డు స్థాయి నుండి వచ్చిన తనను మంత్రి స్థాయిలో నిలబెట్టిన ఘనత జగన్మోహన్ రెడ్డిదే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈర్లే అనురాధ, నియోజకవర్గం ఇంచార్జ్ పరిశీలకులు ఊరుకోటి అప్పారావు, ఎం పీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ రాజారామ్, సర్పంచ్ కళావతి పాల్గొన్నారు.



సుబ్బన్నను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సుబ్బన్నకు సత్కారం

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: ఎపి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులుగా నియమితులైన మీసాల సుబ్బన్నను గురువారం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. నర్సీపట్నంలో మీసాల సుబ్బన్న స్వగృహంలో నర్సీపట్నం నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయుకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం డివిజన్ విద్యుత్ శాఖ కార్యాలయం పరిధిలో ఉన్న ప్రాంతంలో ఈనెల 20న విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని డివిజనల్ విద్యుత్ శాఖ కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పాయకరావుపేట 132 కేవీ సబ్ స్టేషన్, పెద్దాపురం 132 కేవీ లైన్‌లో మరామ్మత్తు చేయడం జరుగుతుందన్నారు. 132 కేవీ కొరుప్రోలు నుండి నర్సీపట్నం బలిఘట్టం 132కేవీ లైన్‌లు నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.



మాడుగుల పశు వైద్యశాలలో డిప్యూటీ డైరెక్టర్ నరసింహులు

పశువైద్యశాలలో రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి - మాడుగుల: మాడుగుల ప్రాంతీయ పశు వైద్యశాలను పాడేరు డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ నరసింహులు గురువారం తనిఖీ చేశారు. రిజిస్టర్ లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, వైద్యశాల సిబ్బంది కచ్చితంగా పాటించవలసిన రాత పూర్వకమైన రికార్డులను, రిజిస్టర్ లను సంవత్సరానికి ఒకసారి పరిశీలన జరుగుతుందన్నారు. మూడు లేదా ఆరు నెలలకు ఒకసారి ఆకస్మిక తనిఖీలు కూడా చేపడతామని తెలిపారు. అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా 13 మంది ప్రాంతీయ వైద్య సంచాలకులు ఉండగా చోడవరం, మాడుగుల ప్రాంతీయ సంచాలకుల పనితీరుకు మంచి మార్కులు లభించాయని ఆయన అన్నారు. జగనన్న పాలవెల్లి కార్యక్రమం మాడుగుల, చీడికాడ మండలాల్లో మూడోదశ కొనసాగుతుందన్నారు. పాడేరు డివిజన్ పరిధిలో 19 మండలాలకును పరిశీలించడం జరుగుతుందని, అందులో అనకాపల్లి జిల్లాలో 8 మండలాలు, అల్లూరి జిల్లాలో 11 మండలాలు పరిశీలిస్తామన్నారు. మాడుగుల పరిధిలో 16,855 పాడి పశువులు ఉన్నాయని తెలిపారు. మాడుగుల ప్రాంతీయ పశు వైద్యశాలకు సంబంధించిన స్థలం వివరాలు అడిగి తెలుసుకుని పశు వైద్యశాలకు సంబంధించిన స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

2న నిరాహార దీక్ష

ప్రజాశక్తి -గొలుగొండ: కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయానికి స్వాతంత్ర్య సమరయోధులు గాం గంటం, మల్లు దొరల పేర్లు పెట్టాలని కోరుతూ జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఆధ్వర్యంలో గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలోని అల్లూరి స్మారక పార్కులో ఈ నెల 20న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఒక రోజు నిరాహార దీక్ష చేస్తున్నట్లు జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పివి.సత్యనారాయణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, గిరిజనులు, రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఆరోగ్య సురక్షతో ప్రజల చెంతకు వైద్యం



పిఎం పాలెంలో కంటి అద్దాలు ఇస్తున్న ముత్తంశెట్టి



గొలుగొండలో మాట్లాడుతున్న ఎంపిపి

ప్రజాశక్తి -యంత్రాంగం

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల చెంతకు వైద్యం అందుతుందని నాయకులు, అధికారులు తెలిపారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

పిఎం పాలెం: ప్రజల చెంతకు స్పెషలిస్ట్ వైద్యసేవలు అందించే ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. గురువారం ఆరోవార్డు రిక్షా కాలనీలో ఆరోగ్యసురక్ష శిబిరంలో స్తానిక కార్పొరేటర్ లక్ష్మిప్రియాంకతో కలిపి పాల్గొన్నారు. కంటి వైద్యశిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించి, దృష్టిలోపం ఉన్నవారికి కళ్లద్దాలను అందజేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, 6,7 వార్డుల వైసిపి అధ్యక్షులు బొట్టా అప్పలరాజు, పోతిన శ్రీనివాస్, అల్లాడ లింగేశ్వరరావు, సంజీవ్, వార్డు మహిళా అధ్యక్షురాలు కొండపల్లి వరలక్ష్మి పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని బి.తాళ్లవలస ఉన్నతపాఠశాల వద్ద నిర్వహించిన ఆరోగ్యసురక్ష వైద్యశిబిరంలో బొత్సపేట.బి.తాళ్లవలస గ్రామాలకు చెందిన 665 మందికి బిపి, సుగర్, ఇతరత్రా వైద్యపరీక్షలు నిర్వమించిన మందులు అందజేశారు. వైద్యశిబిరాన్ని ఎంపిపి కె.రాంబాబు సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ చందక శ్రీను, ఎంపిడిఒ ఎం.విజయకుమార్, వైసిపి మండల అధ్యక్షుడు కె లక్ష్మణరావు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని నరసింహనగర్ పట్టణ ఆరోగ్యకేంద్రంలో గురువారం ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ తనూజ పర్యవేక్షణలో స్పెషలిస్టు వైద్యులు రాకేష్, శరత్, సుజిత్ బోస్ పాల్గొని, 271 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆఫ్తాల్మిక్, దంత వైద్య సేవలు కూడా అందజేసారు. 16 మందిని కంటి ఆపరేషన్లకు రిఫర్ చేశారు వైసిప ఉత్తర సమన్వయకర్త కెకె.రాజు, జివిఎంసి ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ పాల్గొన్నారు.

రావికమతం: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేద ప్రజలకు వరమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్పు, చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలో మరుపాక సచివాలయ పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 418 మంది రోగులు హాజరయ్యారు. వైద్యులు దుర్గాప్రసాద్, ప్రియాంక, ప్రవీణ్, మోహిని, సురేఖ, విజయ్ రాజ్ కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మశ్రీ మాట్లాడుతూ, పేద ప్రజలకు క్షేత్రస్థాయిలో నాణ్యమైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. దీర్ఘకాలిక రోగులను సైతం పరీక్షించి మెరుగైన ఆసుపత్రులకు రోగులను రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. ఈ వైద్య శిబిరాలను ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్న బాబు, తహసిల్దారు మహేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల: ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని తహసిల్దార్ జానకమ్మ కోరారు. చౌడవాడ సచివాలయ పరిధిలో సురక్ష కార్యక్రమం ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు పర్యవేక్షణలో నిర్వహించారు. 250 మంది కి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోపాలకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలో కొత్తూరు, అనకాపల్లి పట్టణంలోని నెయ్యల వీధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ గురువారం పరిశీలించారు. కొత్తూరులో 255 మందికి, నెయ్యల వీధిలో 113 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఎ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, జోనల్ కమిషనర్ వెంకటరమణ, డిఎంహెచ్వో డాక్టర్ హేమంత్, ఎంపీపీ సూరిబాబు, వైసిపి నేతలు మళ్ల బుల్లిబాబు, కొణతాల మురళీకృష్ణ, జాజుల రమేష్, కోరుకొండ రాఘువ పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలో కలిగొట్ల గ్రామంలో నిర్వహించిన జగనన్న అరోగ్య సురక్ష శిబిరాన్ని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు గురువారం పరిశీలించారు. వైద్య సేవల నిమిత్తం శిబిరాలను వచ్చిన వృద్ధులను ఆయన ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైసీపీ మండల అధ్యక్షులు బూరె బాబురావు, సర్పంచ్ సుధారాణి, ఎంపీటీసీ అర్.లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పిపి అగ్రహారంలో గురువారం జగనన్న సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సందర్శించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి దొండ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు కొల్లిమల్ల అచ్చం నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గొలుగొండ: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం పేదలకు వరమని గొలుగొండ ఎంపిపి గజ్జలపు మణికుమారి అన్నారు. జోగుంపేటలో జగనన్న ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. వైద్యులు గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, వైసిపి అధికార ప్రతినిధి జక్కు అప్పలస్వామినాయుడు, సర్పంచ్ జువ్వల లక్ష్మీ, ఎంపిడిఒ డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

జగన్, సుబ్బారెడ్డి కబంధ హస్తాల్లో జివిఎంసి

-సిపిఎం కార్పొరేటర్ గంగారావు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పూర్తిగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి కబంధ హస్తాల్లో నడుస్తోందని 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ధ్వజమెత్తారు. గురువారం కౌన్సిల్ సమావేశం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కౌన్సిల్‌లో సభ్యులకు ఎటువంటి విలువ లేకుండా నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ రోజు జరిగిన కౌన్సిల్ సమావేశంలో సుమారు 75 అంశాలను ఎజెండాలో చేర్చారని, అందులోని అత్యధిక అంశాలకు మేయర్ నెల రోజుల క్రితమే ముందస్తు అనుమతులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. 98 మంది కార్పొరేటర్లు ఉండి కనీస సమాచారం లేకుండా జివిఎంసి నిధులతో నిర్వహించే పనులకు ముందస్తు అనుమతులిస్తే కౌన్సిల్ ఎందుకని ప్రశ్నించారు. జివిఎంసిని ముడసరలోవ సమీపంలోని నూతన భవనంలోకి మార్చి ఈ భవనాన్ని వైసిపి బడా నేతకు 33 ఏళ్ల లీజుకిచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నారని, ఇది దుర్మార్గమని పేర్కొన్నారు.

ఒక రాజకీయ నాయకుడి అండతో కొన్ని కోట్ల రూపాయల విలువైన పనులను ప్రైవేటు ఆపరేటర్లకు టిడిఆర్‌ల రూపంలో కట్టబెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఒక స్లమ్ అభివృద్ధి కింద రూ.350 కోట్లు చేతులు మారుతున్నాయని పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పార్కును వైసిపి కార్యకర్తకు ధారాదత్తం చేయడానికి నిర్ణయం తీసుకున్నారని, ప్రయివేటు వ్యక్తికి ఎలా ఇస్తారని తాము ప్రశ్నిస్తే సమాధానం లేదన్నారు. దీని వెనక కూడా కోట్ల రూపాయలు చేతులు మారాయన్నారు. ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.500 కోట్లు అప్పు తీసుకొస్తున్నారని, పారిశుధ్యం మొత్తాన్ని ప్రయివేటుకు ధారాదత్తం చేసే క్రమంలోనే ఈ అప్పు తీసుకొస్తున్నారని తెలిపారు. మరోపక్క రూ.600 కోట్లతో డి సాల్వేషన్ ప్లాంట్ పిపిపి విధానంలో నిర్వహించేందుకు ప్రణాళికలు రచించారని, ఇందులో కూడా పెద్ద అవినీతి ఉందని, తాడేపల్లి నుంచి డైరెక్ట్‌గా నిర్వహిస్తూ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులచే బలవంతంగా డీ సాల్విలేషన్ వాటర్ కొనిపించి జివిఎంసిని దివాలా దిశగా తీసుకెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయాన్ని వైసిపి ఎమ్మెల్యేలు, అధికారులు లూటీ చేస్తున్నారన్నారు. ఈ లూటికి కేంద్రంగా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తుందన్నారు. ఇప్పటికైనా వైసిపి పాలకవర్గం తన వైఖరిని మార్చుకుని కౌన్సిల్‌ను ఉత్సవ విగ్రహంగా మార్చవద్దని కోరారు.

నేషనల్ ఎక్స్ పో వస్త్ర ప్రదర్శన



ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : బీచ్ రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్ పో ఆధ్వర్యాన విస్తృత శ్రేణి వస్త్రాలతో ప్రదర్శన, అమ్మకాలను చేపట్టారు. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే ఈ ప్రదర్శనలో బెంగాల్, బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘఢ్, రాజస్థాన్, కాశ్మీర్ వంటి ఎన్నో రాష్ట్రాలనుంచి తెచ్చిన బనారస్ సిల్క్, బందేజ్, బ్లాక్, సంగానేరి ప్రింట్ చీరలు, పటోలా, ఖాదీ సిల్క్, హేండ్ ప్రింటెడ్ చీరలు, కాంతా, ఢకాయి, జమదాని, తాబి సిల్క్, పాష్మిన సిల్క్, చందేరి, మహేశ్వరి, కాంజీవరం సిల్క్, ఇతర సిల్క్ వస్త్రాలు లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు. పలు రకాల డ్రెస్ మెటీరియల్స్, పొడవైన దుస్తులు, దుపట్టాలు, సల్వార్ కమీజ్‌లు ఉన్నాయని పేర్కొన్నారు. దసరా, దీపావళి సంప్రదాయాలకు అనుగుణమైన పద్ధతిలో ధరించేందుకు వీలుగా అన్ని సంస్కృతులను మేళవించిన వస్త్రాలను ఒకేచోట ఏర్పాటు చేసామని తెలిపారు. పట్టు వస్త్రాలను అభిమానించు వారికి నేషనల్ ఎక్స్ పో సరియైన చోటు అని పేర్కొన్నారు. ఈ ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 9.00 గంటల వరకు ఉంటుందని, ప్రవేశం ఉచితమని తెలిపారు. చెల్లింపుల కోసం అన్ని రకాల డెబిట్, క్రెడిట్ కార్డులు స్వీకరిస్తామని వివరించారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమకు నచ్చిన వస్త్రాలను కొనుగోలు చేయాలని కోరారు.

అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ విజయవంతం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్-2023 విజయవంతమైందని ఆ సంస్థ ఇండియా డైరెక్టర్ కిశోర్ తోట తెలిపారు. బీచ్ రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది నిర్వహించిన గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ మొదటి 48 గంటలలో 9.5 కోట్ల మంది కస్టమర్ సందర్శనతో రికార్డు నమోదు చేసిందని తెలిపారు. కోట్ల సంఖ్యలో లావాదేవీలు, కస్టమర్ ఆర్డర్లు జరిగాయని వివరించారు. స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు, ఫ్యాషన్, అందం, గృహాలంకరణ, ఉపకరణాలు, ఫర్నిచర్, కిరాణా సామాగ్రి తదితర వర్గాలలో 5,000 కంటే ఎక్కువ కొత్త ఉత్పత్తులు ఈ సేల్‌లో అమ్మకాలకు అందుబాటులో ఉంచామని తెలిపారు. నూతన విక్రేతల కోసం సిఫార్సు రుసుములపై 50 శాతం డిస్కౌంట్‌ను అమెజాన్ ప్రకటించిందని చెప్పారు. ఈ సేల్ ద్వారా 4 నెలల కాలపరిమితికి 1,00,000 కంటే ఎక్కువ ఉద్యోగ అవకాశాలను కల్పించామని తెలిపారు. విశాఖపట్నం నుంచి టెక్స్‌టైల్స్, స్మార్ట్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్స్, కిరాణా వస్తువులు, లెదర్ ప్రొడక్ట్‌లు అగ్రశ్రేణి ఉత్పత్తి వర్గాలుగా ఈ సేల్‌లో నిలిచాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అమెజాన్ ఇండియా పిఆర్ మేనేజర్ శశాంక్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని మారుమూల పంచాయతీ అంజలి శనివారం పంచాయతీ ప్రధాన రహదారికి రెండు కోట్ల రూపాయలు మంజూరు కావడంతో నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభం అయ్యాయి. దీంతో, ఆ పంచాయతీలోని గ్రామాల ప్రజలకు మరికొద్ది మాసాల్లోనే రహదారి కష్టాలు తీరనున్నాయి. వర్షాల సమయంలో ఈ రహదారి పంట పొలాలను తలపించే విధంగా ఉండేది. శాసనసభ్యురాలు భాగ్యలక్ష్మి, కలెక్టర్ సుమిత్ కుమార్‌ల ప్రత్యేక చొరవతో ఎట్టకేలకు రహదారి నిర్మాణ పనులకు అంకురార్పణ కలిగింది. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ రహదారికి బీటీ, సిమెంటు రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ శాఖ డిఈ జి.నరేన్ కుమార్, జేఈ కే.బాలకిషోర్‌లు బుధవారం రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు.

పిచ్చి కుక్కల దాడితో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- పెదబయలు రూరల్: మండల కేంద్రంలో పిచ్చి కుక్కలు దాడి చేయడంతో గురువారం ఇద్దరు గాయపడ్డారు. రోడ్డుపై వెళుతున్న కిముడి లక్ష్మి, గడుతురి చిరంజీవిలపై పిచ్చికుక్కలు కరవడంతో చేతి భాగాలలో తీవ్రమైన గాయాలు అయ్యాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇదిలా ఉండగా ఈనెల 18న పిచ్చి కుక్కలు నలుగురిని గాయపరిచాయి. పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని. పిచ్చికుక్కల బారి నుండి కాపాడాలని వినియోగ దారుల సంఘం అధ్యక్షుడు కూడా కృష్ణబాబు, జంబు దేవరాజు, కీముడూ సంజీవి బాబు, కూడా నర్సింగరావు, తదితరులు కోరారు.




గాయపడిన బాధితులు

రైతులకు అందుబాటులో సబ్సిడీ విత్తనాలు

- ప్రాంతీయ పశు వైద్య సహాయ సంచాలకులు చిట్టి నాయుడు

ప్రజాశక్తి - మాడుగుల: రైతులకు అందుబాటులో సబ్సిడీ విత్తనాలు ఉన్నాయని మాడుగుల ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వి.చిట్టినాయుడు తెలిపారు. గురువారం ఆయన ప్రాంతీయ వైద్యశాలలో మాట్లాడుతూ, రైతులకు అవసరమైన విత్తనాలు అలసంద 1900 కేజీలు అందుబాటులో ఉన్నాయని వీటి ధర మూడు కేజీల రూ.295.50 కాగా సబ్సిడీ ద్వారా రూ.75 చెల్లించి పొందవచ్చు అని తెలిపారు. కాకి జొన్న 5 కేజీలకు గాను రూ.460 కాగా రూ.115 చెల్లించి విత్తనాలు పొందవచ్చని చెప్పారు. ఆధార్ కార్డుతో రైతులు తమ ప్రాంతంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలలో ఈ విత్తనాలు పొందవచ్చని చిట్టి నాయుడు తెలిపారు. మండలంలో 23 రైతు భరోసా కేంద్రాలలో ప్రతి కేంద్రంలో 33 వేల రూపాయల విలువ గలిగిన పశువుల మందుల అందుబాటులో ఉంచామని చెప్పారు. మాడుగుల, చీడికాడ మండలంలో ఇప్పటివరకు 39 గడ్డి కోత యంత్రాలు ఇవ్వడం జరిగిందని, ఆరు యంత్రాలకు గాను ఇండియన్ పెట్టడం జరిగిందని చెప్పారు. రైతుల ఉపయోగకరమైన జాతీయ పశు గణన మిషన్ ద్వారా కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా ఆడపెయ్య వీర్య ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇప్పటివరకు 108 కృత్రిమ గర్భోత్పత్తి ఇంజక్షన్లు చేసామని వాటిలో 18 ఆడపెయ్యలు పుట్టాయని, 10 ఇంజక్షన్లకు 9 తప్పనిసరి ఆడపెయ్యలు పుడతాయని ఆయన అన్నారు. ఒక ఇంజక్షన్కు గాను 1300 రూపాయలు కాగా 800 రూపాయలు ప్రభుత్వం భరిస్తుందని రైతు కేవలం 500లకే ఈ ఇంజక్షన్ పొందవచ్చన్నారు. ఒకవేళ మగపెయ్యి పుడితే 250 రూపాయలు తిరిగి రైతుకు చెల్లిస్తున్నామన్నారు.



కింగ్ కోబ్రా, కొండచిలువ హతం

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండలో గ్రామస్థుల చేతిలో 12 అడుగుల కింగ్ కోబ్రా హతమైంది. గురువారం ఉదయం 12 అడుగుల కింగ్ కోబ్రా గ్రామస్థుల కంట కనపడింది. గ్రామ స్థులు, యువకులు దాన్ని వెంబడించి కర్రలతో కొట్టి హతమార్చారు. ఈ 12 అడుగుల భారీ పామును చూసేందుకు గ్రామస్థులు ఎగబడ్డారు.



హతమైన కింగ్ కోబ్రా

కోటవురట్ల: మండలంలోని లింగాపురం గ్రామ శివారున వెంకటాపురం రోడ్డులో రైతుల కల్లం వద్ద భారీ కొండ చిలువను హత మార్చారు. కొండ చిలువు రోడ్డు దాటుతుండగా రైతులు భయ భ్రాంతులకు గురై హతమార్చారు. సుమారు 12 అడుగుల కొండచిలువ కనిపించడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఎన్నికలకు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి-రోలుగుంట:కార్యకర్తలను క్షేత్రస్థాయి నుండి బాధ్యత తీసుకొని నాయకులు నడిపించాల్సిన సమయం ఆసన్నమైందని రోలుగుంట మండలం తెలుగుదేశం సీనియర్ నాయకుడు గండి సింహాద్రి అన్నారు. గురువారం ఆయన స్వగ్రామమైన కుసర్లపూడిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం గతం కంటే పార్టీ మరింతగా పుంజుకుందని, ఈ సమయంలో కార్యకర్తలను నడిపించాల్సిన బాధ్యత నియోజకవర్గ బాధ్యులపై ఉందని ఆయనన్నారు. ఎన్నికలకు సమయం ఎంతో లేదని ప్రతి గ్రామంలోనూ కార్యకర్తలను సమావేశపరిచి ఎన్నికలకు సన్నద్ధం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తలను సన్నద్ధం చేయకపోతే నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని ఆయన అన్నారు.



మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

చంద్రబాబుకు మెరుగైన వైద్యం అందించాలి

-మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:చంద్రబాబు నాయుడుకు మెరుగైన వైద్యం అందించాలని మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. డుంబ్రిగుడలోని దేశం పార్టీ మండల అధ్యక్షుడు టి సుబ్బారావు నివాసంలోని గురువారం జరిగిన ఓ కార్యానికి హాజరైన మాజీ మంత్రి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక అక్రమంగా అరెస్టు చేశారని, ప్రభుత్వ తీరుపై ఆయన మండిపడ్డారు. వైకాపా ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పి వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు సివేరి అబ్రహం, టిఎన్‌టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి పాల్గొన్నారు.